
మినీకథ

# తిరుగులేని సాక్ష్యం

-డి.కామేశ్వరి




లాయరు జానకి స్త్రీ జనోద్ధరణకి కంకణం కట్టుకున్న న్యాయవాది. ఆమె చేపట్టే కేసులు అన్నీ స్త్రీల సమస్యలకి సంబంధించినవే అయివుంటాయి. పతితలు, మోసపోయిన స్త్రీలు, అన్యాయాలకి అక్రమానికి గురి అయిన అబలలకి ఆమె అండగా నిలిచి న్యాయస్థానంలో వారి తరుపు న్యాయంకోసం పోరాడుతుంది.

ఆ రోజు కేసు పడుపువృత్తి చేసుకునే అమ్మాయి శకుంతల కేసు! చూడగానే కాస్త అమాయకంగా కనిపించే యిరవై రెండేళ్ల శకుంతల ఓ వేశ్య అని చెపితే గాని ఎవరికీ తెలియదు. పెద్దకళ్ళు, కొనదేరిన గడ్డం, మంచి జుత్తు, చామనచాయ రంగులో వున్న ఆమెలో ఏదో ఆకర్షణ వుందనిపిస్తుంది చూసిన ఎవరికన్న. ఆమెకిష్టం లేకపోయినా తల్లి బలవంతంగా వృత్తిలోకి దించింది. గత ఏణ్ణర్థంగా ఆమె ఆ పట్టణంలో పెద్ద బిజినెస్ మాగ్నెట్ అయిన రామ్మోహన్‌రావు ప్రాపులో వుండిపోయింది. ఆయన ఓ యిల్లు తీసుకుని శకుంతలని వుంచి, ఆమె పోషణకి డబ్బు యిచ్చి తనిష్టం వచ్చినపుడు వచ్చి వెళ్లే ఏర్పాటు చేసుకున్నాడు. ఇంకెవరితో ఏ సంబంధం వుండకూడదన్న అతని షరతుకు సంతోషంగా అంగీకరించి అతనితో వుండిపోయింది. ఆరు నెలల తరువాత ఆమె గర్భవతి అయింది. అప్పటినుంచి రామ్మోహనరావుకి ఆకర్షణ తగ్గింది. రాకపోకలు తగ్గాయి. గర్భం తీయించుకోమని చాలా బలవంతం చేశాడు. తల్లినవ్వాలన్న కాంక్షని అరికట్టలేక శకుంతల అతని మాటలు వినలేదు. ఆమెకి ఆరోనెల వచ్చాక మరి పూర్తిగా రాకపోకలు మానాడు. శకుంతల కాళ్లావేళ్లా పడితే ఓ వెయ్యి రూపాయలు మొహాన పారేసి యింక నీకూ నాకూ సంబంధంలేదు, అని వెళ్లిపోయాడు. ఆమె తినితినక కష్టాలు పడి బిడ్డని కంది. గర్భవతి అవడం, పిల్లాడు పుట్టడం, అతని దగ్గర వుండిపోవడంతో ఆమెకి యితర్రా సంపాదన పోయింది. యిప్పుడు బిడ్డ తల్లి అని అసలు ఎవరూ రావడం లేదు. బిడ్డని పెంచే స్థోమత లేక ఆమె అష్టకష్టాలు పడుతూంది. ఆయన రక్తం పంచుకుని పుట్టిన బిడ్డ పోషణవున్న కొద్దో గొప్పో డబ్బు యిప్పించమని లాయరుజానకి శరణు వేడింది శకుంతల. తన బిడ్డని జానకి పాదలమీద పడేసింది.

ఆ రోజు శకుంతల కేసు హియరింగ్‌కి వచ్చింది. జానకి శకుంతల కథ అంతా చెప్పి కేసు ప్రజెంట్ చేసింది జడ్జి ముందు. రామ్మోహన్‌రావు తరపున పెద్ద లాయరు చాలా గట్టిగా వాదించాడు. 'యువర్ ఆనర్, నా క్లయింట్ రామ్మోహనరావు సంఘంలో పరువు ప్రతిష్ఠలతో బతుకుతున్న పెద్ద మనిషి. అలాంటి వ్యక్తిని బ్లాక్‌మెయిల్ చేసి డబ్బు గుంజాలనే ఉద్దేశంతో ఎవరికి పుట్టిన బిడ్డనో నా క్లయింట్ బిడ్డ అని అబద్ధం చెప్పి మోసంతో డబ్బు గుంజాలనే ప్రయత్నం ఇది. ఓ పడుపు వృత్తి చేసుకునే స్త్రీ తన బిడ్డకి ఫలానా వ్యక్తి తండ్రి అని చెప్పడంలో ఎంత సబబు వుందో న్యాయమూర్తులే ఆలోచించండి. యువరానర్, చూడండి ఆ బిడ్డని చూడండి, రక్తం పంచుకు పుట్టిన బిడ్డ అయితే కొద్దో గొప్పో పోలికలుంటాయి. దీన్ని బట్టి యిందులో ఎంత నిజం వుందో న్యాయమూర్తులే ఆలోచించండి' అంటూ వాదించాడు. లాయరు జానకికి ఈ కేసులో బలం లేదన్నది ముందునుంచి తెలుసు. ఓ బిడ్డ ఫలానా వ్యక్తికే పుట్టాడని నిరూపించలేదు. అందులో వేశ్యకి పుట్టిన బిడ్డ అయితే మరీ కష్టం అని తెలుసు. అయినా శకుంతల పట్ల సానుభూతితో రామ్మోహనరావు ఏ చిన్న పొరపాటునన్నా దొరకడా. ఏ చిన్న ఆధారమన్నా దొరకదా అన్న ఆశతో కేసు తీసుకుంది. దురదృష్ట వశాత్తూ బిడ్డకి తండ్రి పోలిక అసలు లేదు. అది డిఫెన్సు లాయరు వాదానికి మరింత బలాన్నిచ్చింది.

బోనులో నిలబెట్టి డిఫెన్సు లాయరు రామ్మోహనరావుని అడుగుతున్న ప్రశ్నలమీద ఆమె దృష్టి లేదు. రామ్మోహనరావు మనిషి చాలా గాభరాపడ్తున్నాడు. చాలా అనీజీగా మాటిమాటికి నాలికతో కింద పెదవి తడుపుకుంటున్నాడు. తన పరువు ప్రతిష్ఠ యిలా బజారుకీడ్చిన శకుంతల యింత దూరం వెళ్లి యిలా కోర్టుకెక్కుతుందని ఎన్నడూ ఊహించని రామ్మోహనరావు లాయరు జానకి ఈ కేసు చేపట్టిందని తెలిసి మరింత గాభరాపడుతున్నాడు. లాయరు జానకి పట్టిన కేసు గెలవక మానదు అని అతనికి తెలుసు. ఇప్పుడు ఈ పుట్టిన బిడ్డ తనదేనని నిరూపణ అయితే సంఘంలో మొహం ఎత్తలేడు. ఇంట్లో యిప్పటికే జరుగుతున్న రాద్ధాంతం అతని మనశ్శాంతిని హరించింది. ఛా, యింతదూరం వెడుతుందని తెలిస్తే పది వేలో యిరవై వేలో పారేసి వదుల్చుకునే వాడిని అని తిట్టుకున్నాడు శకుంతలని. తన లాయరు ఎంత భరోసా యిచ్చినా అతను నెర్వస్‌గా వున్నాడు. మాటిమాటికీ గాభరాగా నాలుకతో పెదాలు తడుపుతున్నాడు.

'అతనినే గమనిస్తున్న లాయరు జానకి కళ్ళల్లో చిన్న మెరుపు వచ్చింది. డిఫెన్సు లాయరు వాదన ముగిసింది. వాది తరుపు లాయరు తమ సాక్షులని ప్రవేశ పెట్టవచ్చని జడ్జి చెప్పారు.

జానకి తన సాక్షులను ఒక్కొక్కరిని ప్రవేశ పెట్టింది. శకుంతలని వుంచిన యింటి ఓనరు, ఎదుట కిళ్ళీబడ్డీవాడు, సైకిల్‌షాపువాడు రామ్మోహనరావు ఆ యింటికి తరచు వచ్చేవాడని చెప్పించి రామ్మోహనరావుకి శకుంతలతో పరిచయం వుందన్న పాయింటే ఎస్టాబ్లిష్ చేయించింది. డిఫెన్సు లాయరు ఆ వాదనని ఖండిస్తూ 'యువరానర్, ఏ బలహీన క్షణాలలోనో నా క్లయింట్ పర స్త్రీ పొందుకోరి వెళ్లి వుండచ్చు. అంత మాత్రాన పదిమందితో గడిపే ఆ వేశ్యకి పుట్టిన బిడ్డ నా క్లయింట్ బిడ్డని ఏ ఆధారంతో వాది తరుపు లాయరు వాదిస్తారు' అని సవాల్ చేశాడు.

జానకి తన ఫైలులో ఏదోవెతికింది. తన అసిస్టెంట్ చెవిలో ఏదో చెప్పింది. అసిస్టెంట్ బయటికి వెళ్లాడు గబగబ. 'యువరానర్, కేసుకి సంబంధించిన ఓ ముఖ్య


కాగితం మర్చిపోయాను, నా అసిస్టెంటు అది తెచ్చే లోపల ఓ అరగంట రిసెస్ కోరుతున్నాను! అంది. 'గ్రాంటెండ్' అని జడ్జిగారు ఛాంబర్‌లోకి వెళ్లారు.

అరగంట తరువాత తిరిగి కోర్టు మొదలైంది. ఈసారి బోనులో శకుంతలని బిడ్డతోసహా నిలబెట్టింది జానకి. జడ్జీగారికి సానుభూతి కలిగేటట్టు శకుంతల దయనీయ పరిస్థితి మళ్లీ చెప్పింది. తన ఫైలులోంచి బిడ్డ పుట్టిన బర్త్ సర్టిఫికెట్ చూపింది. 'యువరానర్ ఈ బిడ్డ పుట్టినపుడు బర్త్ సర్టిఫికెట్‌లో కూడా తండ్రి రామ్మోహనరావ్ అని రాయించింది. అప్పటికి కోర్టు కెక్కుతానని గాని, ఆయననించి పోషణకి డబ్బు అడగాలనే ఆలోచన లేదు. నా క్లయింట్‌కి అతను తండ్రి కనక ఆ బిడ్డ తండ్రి పేరు రాయించింది. గౌరవనీయులైన డిఫెన్సు లాయరుగారు రామ్మోహనరావుకి పుట్టిన బిడ్డ అయితే కొద్దోగొప్పో పోలిక రాదా అన్నారు. యువర్ ఆనర్, అటు చూడండి... అంత స్పష్టంగా తండ్రి బిడ్డల మధ్య పోలిక కనిపిస్తుంటే డిఫెన్సు లాయరుగారికి ఎలా కన్పించలేదో ఆశ్చర్యం! ఈ బిడ్డ రామ్మోహనరావుదనడానికింత కంటె వేరే సాక్ష్యం అక్కరలేదు. రక్తం పంచుకు పుట్టిన బిడ్డకి తండ్రి రూపు రేఖలు, మానరిజమ్సు ఎలా సంక్రమిస్తాయో మీరే చూడండి.

రామ్మోహనరావు మరింత గాభరాగా, నెర్వస్‌గా పెదాలు తడుపుకుంటున్నాడు. అమాయకంగా ఉన్న ఆ ఐదు నెలల బిడ్డ కూడా అదే విధంగా పదే పదే కింద పెదవి నాకు తున్నాడు నాలికతో. జడ్జిగారు ఆశ్చర్యంగా చూశారు. కోర్టులో అందరూ తెల్లపోయారు. రామ్మోహనరావు మొహం మాడిపోయింది. డిఫెన్సు లాయరు మొహం తెల్లబడింది. ఒక్క క్షణం చూసి జడ్జిగారు చకచక జడ్జిమెంటు రాసి చదివారు. 'ఈ బిడ్డకి తండ్రి రామ్మోహనరావు అని స్పష్టపడినందున ఓ ఏభైవేల రూపాయలు బ్యాంకులో వేసి ఆ వడ్డీ బిడ్డ పోషణకి వినియోగించాలని తీర్పు యిచ్చారు'.

శకుంతల కోర్టు బయట జానకి పాదాలమీద పడిపోయింది. "ఛా ఛా లే, యింక నీకేం భయం లేదు, వెళ్లు' అని ఆప్యాయంగా బుజం తట్టింది. కృతజ్ఞతతో, కన్నీళ్లతో శకుంతల మళ్లీ నమస్కరించి శలవు తీసుకుంది. "అ... అన్నట్టు చూడు. ఇది ఓ దగ్గు మందు సిరప్. ఎప్పుడన్నా బిడ్డకి దగ్గువస్తే వాడు' అంటూ బ్యాగు నుంచి ఓ కాఫ్ సిరప్ బాటిల్ తీసియిచ్చి నవ్వుతూ బయటికి నడిచింది.

గమనిక:— (షిడ్నీ షెల్డన్ నవలలో ఓ చిన్న బిట్ చదివాక—)




# ఆంధ్రజ్యోతి
## సచిత్ర వార పత్రిక

# కార్టూన్ల పోటీ

* 20 ఉత్తమ కార్టూన్లకు 20x75-1500 రూపాయలు
* రెండు ఉత్తమ కార్టూన్ బొమ్మల కథలకు 500x2 -1000రూపాయలు
(10 లేదా 12 పేజీలకు మించని కథ)
* స్ట్రిప్ కార్టూనులు 50x50-2500 రూపాయలు

తెలుగు కార్టూనిస్టులు యీ సదవకాశాన్ని వినియోగించుకొని ఉత్తమమైన చిత్రాలను గీసి 5000 రూపాయల బహుమతులను గెలుచుకొంటారని ఆశిస్తున్నాము.

## నిబంధనలు:

* ఒక కార్టూనిస్టు ఎన్ని బొమ్మలయినా పంపవచ్చు. ఎన్ని పోటీలలోనయినా పాల్గొనవచ్చును.
* కాపీ కార్టూనులు, అనుసరణలు పంపరాదు.
* కార్టూనులు తమ సొంతమని, అనుసరణలు కావని హామీ పత్రం జతపరచాలి.
* బహుమతికి యోగ్యం కాని, అంగీకరింపని కార్టూనులు తిప్పి పంపగోరేవారు సొంత చిరునామాతో స్టాంపులు అతికించిన కవరు విధిగా జతచేయాలి.
* బహుమతి నిర్ణయం ఆంధ్రజ్యోతి సంపాదక వర్గానిదే తుది నిర్ణయం. ఉత్తర ప్రత్యుత్తరాలు జరపబడవు.
* బహుమతి పొందిన కార్టూన్లుగాక వచ్చిన వాటిలో మంచివి ఉంటే ఆయా కార్టూన్లను ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రికలో వీలువెంబడి ప్రచురించగలము.
* కార్టూనిస్టులు తమ కార్టూన్లను

కార్టూన్ల పోటీ
ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక
పోస్టుబాక్స్ - 712
విజయవాడ-520 010

చిరునామాకు పంపాలి.

గడువు తేదీ మార్చు: 31-8-1985

ఎడిటర్